క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ సెస్ ఏఈ మధుకర్ గురువారం తెలిపారు. 11 కేవీ లైన్ మరమ్మతు పనులు, విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా పట్టణంలోని శాంతినగర్, రాళ్లబావి, విమల్ టాకీస్, వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంతం, గాంధీనగర్, సుభాష్‌నగర్, గీతానగర్, ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

స్వతంత్ర అభ్యర్థిగా జగ్గారావుపల్లి వాసి



నామినేషన్ దాఖలు చేస్తున్న తిరుపతి

బోయినపల్లి: కరీంనగర్ పార్లమెంట్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన మాంకాళి తిరుపతి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి తన నామినేషన్ పత్రాలు అందించారు. గతంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తిరుపతి ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఇపుడు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గతంలో బోయినపల్లి జెడ్పీటీసీగా పోటీచేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మే 1 నుంచి నెలరోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాల్లో విద్యార్థులకు కరాటే, యోగా, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, షటిల్ బాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్ బాల్, విలువిద్య వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా క్రీడల శాఖ అధికారి ఎ. రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శిబిరాల నిర్వహణకు ఆసక్తి, ఆయా అంశాల్లో నిపుణులైన సీనియర్ క్రీడాకారుల నుంచి ఈనెల 29 లోపు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు కలెక్టరేట్‌లోని రెండో అంతస్తులో గల క్రీడలశాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు అందించాలన్నారు. మరిన్ని వివరాలకు 9440 239783 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: స్వయం ఉపాధికి దోహదపడే బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రామానంద తీర్థ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు ఆసక్తి అర్హత కలిగిన యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండునెలల వ్యవధి ఉన్న కోర్సులో పదో తరగతి పాసై 18 ఏళ్లు నిండిన గ్రామీణ యువతులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు తమ సర్టిఫికెట్లతో మే 1న సంస్థ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని, మరిన్ని వివరాలకోసం 91339 08000 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


మహాచండీ యాగం జరుపుతున్న వేద పండితులు

రుద్రంగి: మండలకేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తయి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో గురువారం 50 మంది జంటలతో మహాచండీ యాగం నిర్వహించారు. అభిషేకం, మెట్లపూజ, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెలుకల తిరుపతి, పెద్దఎత్తున భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా రాజేందర్‌రావును గెలిపించాలి


మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించుకోవాలని పార్టీ నాయకులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎల్లారెడ్డిపేటలో ఈనెల 30 జరిగే రోడ్‌షోను విజయవంతం చేయాలన్నారు. రోడ్‌షో విజయవంతానికి గ్రామ కమిటీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు షేక్ గౌస్, పందిర్ల లింగంగౌడ్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గుండాడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివారులో ముక్కు మూసుకునుడే


ఎల్లారెడ్డిపేట శివారులో పడేసిన వ్యర్థాలు



వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాల తరలింపు

- మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపక్కనే కోళ్ల వ్యర్థాలు
- దుర్వాసనతో రోగాలబారిన ప్రజలు
- నోటీసులు జారీచేసినా అదే తీరు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఎల్లారెడ్డిపేట: చికెన్ సెంటర్ల నిర్వాహకులు రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా వదిలేస్తున్న వ్యర్థాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, నిర్వాహకులకు నోటీసులు జారీచేసి చేతులు దులుపుకుంటున్నారు. మండలకేంద్రంతో పాటు రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్ మేజర్ గ్రామపంచాయతీల పరిధిల శివారులో కోళ్ల వ్యర్థాలను నిర్లక్ష్యంగా పడేస్తున్నారు. రెండ్రోజులకోసారి వ్యాన్లలో కోళ్ల వ్యర్థాలు తరలిస్తుండటంతో సమీప నివాసాల్లోని ప్రజలు దుర్వాసనతో అనారోగ్యం బారినపడుతున్నారు. అధికారులు నోటీసులు జారీచేసినా నిర్వాహకులు అలాగే వ్యవహరిస్తున్నారు.

రాత్రిపూట తరలింపు..

రోజంతా చికెన్ సెంటర్లలో వాటి వ్యర్థాలను దుకాణంలోనే ఉంచి అర్ధరాత్రి గ్రామశివారు ప్రాంతాల్లో ఎవరికి కనిపించకుండా పడేస్తున్నారు. ఎండ వేడిమితో వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వ్యాపిస్తోంది. ఎల్లారెడ్డిపేటతో పాటు నాలుగు గ్రామాల ప్రజలు అనారోగ్యారానికి గురవుతున్నారు. రోజూ చెత్తబండ్లు గ్రామాల్లో ఉదయం, సాయంత్రం తిరుగుతూ చెత్త సేకరిస్తున్నా వాటికి అందించకుండా ద్విచక్ర వాహనాలపై తీసుకెళ్లి నివాసాలకు దగ్గరగా వదిలేస్తున్నారు. దీంతో దుర్గంధంతో ముక్కు మూసుకునే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రెండ్రోజులకోసారి వ్యాన్లలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు.

నోటీసులు జారీ చేసినా..

కోళ్ల వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదిలేస్తున్న చికెన్ సెంటర్ల నిర్వాహకులపై ప్రజలు అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ అధికారులు సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు. ఆ తర్వాత అధికారులు మళ్లీ ఆటువైపు కన్నెత్తి చూడడం లేదు. నిర్వాహకులకు జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితులు ఉండవని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా చికెన్ సెంటర్ నిర్వాహకులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యర్థాలను డంపు యార్డులో, చెత్త బండికి ఇవ్వాలని, రోజూ వ్యాన్‌లు వచ్చే విధంగా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుర్వాసన వస్తోంది


చికెన్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా గ్రామాల శివారు ప్రాంతాల్లో వ్యర్థాలు పారేస్తున్నారు. సమీపంలో నివాసముంటున్న వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. కోళ్ల వ్యర్థాల వల్ల వచ్చే దుర్వాసనతో ప్రజలు ప్రాంతానికి వెళ్లలేకపోతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలు కాపాడాలి.

– దానియల్, ఎల్లారెడ్డిపేట

చర్యలు తీసుకుంటాం


గ్రామ శివారులో కోళ్ల వ్యర్థాలు వదిలేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ముందుగా చికెన్ సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు జారీచేస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. దుకాణాల ముందుకు వచ్చే చెత్తబండికి వ్యర్థాలు అందించాలి. వ్యర్థాలను నిర్లక్ష్యంగా వదిలేసే వారిపై నిఘాపెట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించాం.

– దేవరాజు, పంచాయతీ అధికారి, ఎల్లారెడ్డిపేట

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి: మండలంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు హస్తం గూటికి చేరారు. గురువారం మాజీ డీసీఎమ్మెస్ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, బోయినపల్లి ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, బోయినపల్లి, అనంతపల్లి ఎంపీటీసీలు సంబ బుచ్చమ్మ, కంకణాల వనజతో పాటు పలువురు మాజీ సర్పంచులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచులు ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, సంబ లక్ష్మీరాజం, కన్నం మధు, గంద్రతి శ్రీనివాస్, రంగి రేణుక తిరుపతి, కొప్పుల లక్ష్మిస్వామి, కందుల కరుణగంగారెడ్డి, బొంగోని లక్ష్మిమల్లేశం, అంజయ్య, మాజీ ఎంపీటీసీలు అనిత, పిట్టల రమేశ్, మొండయ్య, వీరమల్లు, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, రాములు, పోలె కొమురయ్య, తదితర నాయకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్‌రెడ్డి, బోయినపల్లి సింగిల్‌విండో చైర్మన్ జోగినిపల్లి వెంకట్రామారావు, ఎంపీటీసీలు ఉపేందర్, కొంకటి శిరీష మధు, తదితరులు పాల్గొన్నారు.

'బండి'కి తెలిసింది మత విద్వేషాలు రెచ్చగొట్టడమే



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

సిరిసిల్లటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి దేశాన్ని రక్షించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని బీవైనగర్ సీపీఎం కార్యాలయంలో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. 2014లో అధికారంలోకి రాకముందు నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి 750 మంది రైతులను పొట్టనబెట్టుకున్నారని విమర్శించారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని, మత విద్వేషాలు రెచ్చగొట్టడం మాత్రమే తెలుసన్నారు. జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, ఎరవెల్లి నాగరాజు, ముక్తికాంత అశోక్, సూరం పద్మ, శ్రీరాం సదానంద్, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, పోచమల్లు పాల్గొన్నారు.

కరీంనగర్‌కు తరలిన నాయకులు


వేములవాడ రూరల్: తరలివెళ్తున్న బీజేపీ నాయకులు

వేములవాడరూరల్: కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్‌కు వేములవాడ రూరల్ పార్టీ అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండోసారి ఎంపీగా బండి సంజయ్, మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ రాబోతున్నారన్నారు.

ముస్తాబాద్: కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ నామినేషన్ ప్రక్రియకు మండలం నుంచి బీజేపీ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్ విజయం ఖాయమని నాయకులు పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్ రావు, మహేందర్, రమేశ్ రెడ్డి, గిరి, కృష్ణ,క్రాంతి, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ నామినేషన్ సందర్భంగా మండలం నుంచి ఆ పార్టీ నాయకులు ద్విచక్రవాహనాలపై పెద్ద ఎత్తున తరలివెళ్లారు. జిల్లా కార్యదర్శి బుగ్గారెడ్డి, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కోనేటి సాయిలు, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, నాయకులు మహేందర్, సాయికుమార్, సంజీవరెడ్డి, దేవారెడ్డి, సత్యంరెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

28న టీజీ ఆర్సీసీ సెట్ పరీక్ష

సిరిసిల్లటౌన్: గురుకుల ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించే ఆర్సీసీ సెట్ పరీక్షలను 28న ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు నిర్వహించనున్నట్లు ఆర్సీవో ఎం.గౌతం కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లా కేంద్రాల్లో 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని వెంట హాల్ టికెట్, బాల్‌పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్ తెచ్చుకోవాలని సూచించారు.

ప్రజలను రెచ్చగొడుతున్న 'బండి'

ఎల్లారెడ్డిపేట: ఏపీలో తిరుపతి సభలో భగవద్గీత కావాలా..బైబిల్ కావాలా అని బండి సంజయ్‌కుమార్ ప్రజలను రెచ్చగొడుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీతో పాటు ఎంపీలు సైతం కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. పార్లమెంట్‌కు వెళ్లని ఎంపీకి ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారన్నారు. అలాంటి వ్యక్తికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వీర్నపల్లి: మండలకేంద్రంతో పాటు లాల్‌సింగ్ తండా, వన్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీడీడీఆర్‌డీఏ శేషాద్రి పరిశీలించారు. అకాలవర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనపు సిబ్బందితో ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ నర్సింహులు, పాపారావు, ఏపీఎం నర్సయ్య, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ శుభ్రం


శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వేములవాడ : వేములవాడ పట్టణంలోని జాత్రాగ్రౌండ్‌లో లక్ష్మీగణపతి కాంప్లెక్స్ నుంచి శాస్త్రీనగర్ వరకు రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీటితో భక్తులు, స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. గురువారం 'రోడ్డుపైనే డ్రైనేజీ నీరు' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితంకాగా ఆలయ అధికారులు స్పందించారు. డ్రైనేజీని శుభ్రం చేయించి రోడ్డును క్లీన్ చేయించారు. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు


పోలీసులు సీజ్ చేసిన డీజే సౌండ్ సిస్టం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం..వెంకటాపూర్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కొందరు యాదవకాలనీ వద్ద డీజే పెట్టి ఇబ్బందికి గురిచేస్తున్నారన్నా సమాచారంతో అక్కడికి వెళ్లారు. డీజే యాజమాని వంగరి సుధాకర్‌ను అడగగా ఎలాంటి అనుమతులు లేకుండా డీజే పెట్టి విధులకు ఆటంకం కల్పించారు. హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య ఫిర్యాదు మేరకు యాజమాని సుధాకర్, ఆపరేటర్ అంకెన మహేశ్‌పై కేసు నమోదు చేయడంతో పాటు డీజే సీజ్‌చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

ఆరు డీజేలు సీజ్

ముస్తాబాద్: మండలంలో అనుమతులు లేకుండా నడిపిన ఆరు డీజేలను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా డీజేలు పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి వైద్యురాలు స్నేహ ఆధ్వర్యంలో గురువారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మగుండం శుభ్రం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ ధర్మగుండంలోని మురికినీటిని గురువారం ఆలయ సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం గోదావరి జలాలతో ధర్మగుండంలో మళ్లీ నీటిని నింపనున్నారు.

ఫుడ్ పాయిజన్ కారకులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్లకల్చరల్: సుల్తానాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆహారం కల్తీ జరిగి 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత గురుకులాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శించారు. విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా పాలకులకు పట్టింపులేదన్నారు. సుల్తానాబాద్, భువనగిరి పాఠశాలల్లో సైతం ఫుడ్ పాయిజన్ జరిగిందని, కారకులను ఉద్యోగాల తొలగించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మట్టి శ్రీనివాస్ కోడం నరేశ్, సందీప్ పోతర్ల వంశీ, కోడం వెంకటేశ్, ఒగ్గు అరవింద్, సందీప్, నరేశ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ ఐదేళ్లలో చేసిందేమీ లేదు

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్


మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కోనరావుపేట: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తన ఐదేళ్ల కాలంలో ప్రజలకు చేసిందేమీ లేదని ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. కోనరావుపేటలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2014లో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వరకు రైలుమార్గాన్ని తీసుకొచ్చింది తామేనన్నారు. త్వరలోనే సిరిసిల్ల, వేములవాడకు కూడా రైల్వేలైన్ పూర్తవుతుందని తెలిపారు. తన హయాంలోనే కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీగా మార్చామన్నారు. బండి సంజయ్ ధర్మం.. ధర్మం అంటూ అభివృద్ధిని విస్మరించాడని విమర్శించారు. ఎంపీగా ఐదేళ్లలో రూ.5 కూడా తీసుకురాలేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కోనరావుపేట మండలం మల్కపేటలో ప్రాజెక్టును నిర్మించి 3 టీఎంసీల నీటిని తీసుకొచ్చామన్నారు. రోడ్లకు వంతెనల కోసం నిధులు తెచ్చామన్నారు. మల్కపేటలో చలిమెడ కుటుంబీకులు రూ.6కోట్లతో రామాలయం, రూ.2కోట్లతో పాఠశాలను నిర్మించడం అభినందనీయమన్నారు. చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ఎంపీగా పనిచేసిన వినోద్‌కుమార్, బండి సంజయ్ పాలనలో ఎవరు ఎంత అభివృద్ధి చేశారో ప్రజలు గుర్తించి ఓటేయాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండలాధ్యక్షుడు దేవయ్య, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి సుమన్ మోహన్‌రావు


ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: మలేరియా నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సుమన్ మోహన్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో గురువారం మలేరియా నిర్మూలన దినోత్సవ ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు 2030 నాటికి మలేరియా నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి నిల్వలేకుండా చూడాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు శ్రీరాములు, రజిత, డీపీవో ఉమాదేవి, హెచ్‌ఈవో లింగయ్య,హెచ్‌ఈ బాలయ్య, ఎస్ యూవో మోహన్, హెచ్‌ఎస్ భూమయ్య పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం


రథంపై ఊరేగుతున్న స్వామివారు


అంబలి పంపిణీ చేస్తున్న యూనియన్ సభ్యులు

గంభీరావుపేట: గంభీరావుపేటలో శ్రీ సీతారామ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రాములోరి రథోత్సవం కనుల పండువగా జరిగింది. రామనామస్మరణతో భక్తులు రథాన్ని పురవీధుల్లో లాగారు. మహిళలు మంగళహారతులతో రథానికి స్వాగతం పలికారు. యూనిక్ బైక్ యూనియన్ సభ్యులు భక్తుల కోసం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

సాగు రకాలపై ప్రదర్శన


పెద్దలింగాపూర్‌లో ప్రదర్శిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో గురువారం బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతులకు వివిధ రకాల వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. బహుళ అంతస్తుల పంట, పాలీహౌస్, సేంద్రియ వ్యవసాయం, హైడ్రోపోనిక్స్ మోడళ్లను ప్రదర్శించారు. జిల్లా వ్యవసాయాధికారి డి.భాస్కర్, డాక్టర్ తిరుపతి, మండల వ్యవసాయాధికారి ఎం.సురేశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి.రంజిత్, ఏఈవో శిరీష, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.అరుణ్‌బాబు, కె.భవ్యశ్రీ, వ్యవసాయ విద్యార్థులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో తగ్గిన ఉత్తీర్ణత శాతం


చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల

చందుర్తి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో ఈసారి ఉత్తీర్ణత శాతం 30 శాతం తగ్గింది. ఏటా జిల్లాలో ద్వితీయ, తృతీయ స్థానంలో ఉండే కళాశాల ఉత్తీర్ణత శాతం ఈసారి వెనుకబడిపోయింది. బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో గతేడాది 98 ఉత్తీర్ణత శాతం కాగా, ఈ ఏడాది 68 శాతానికి పడిపోయింది. ప్రథమ సంవత్సరంలో గతేడాది 85 శాతం ఉండగా ఈసారి 88 శాతం సాధించారు. ప్రథమ సంవత్సరంలో 3 శాతం ఉత్తీర్ణత శాతం పెరిగినా, రెండో సంవత్సరంలో ఒక్కసారిగా 30 శాతానికి పడిపోవడంతో ఫలితాలు అధ్యాపకుల అంచనాలను తారుమారు చేశాయి. గతేడాది కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన బాలికలు ఈ ఏడాది పూర్తిగా వెనుకబడిపోయారు. కాగా కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశ్ లోపాలపై బేరీజు వేసుకుంటున్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

కోనరావుపేట: ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు. ఎంపీపీ చంద్రయ్యగౌడ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అన్ని గ్రామాల సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.